క్లుప్తంగా

మార్కెట్‌కు పోటెత్తిన వేరుశనగ



ఎమ్మిగనూరు మార్కెట్‌కు వచ్చిన దిగుబడులు

ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు ఆదివారం పంట ఉత్పత్తులతో కళకళలాడింది. ఒక్కరోజే 508 మంది రైతులు 4,803 క్వింటాళ్ల వివిధ రకాల దిగుబడులను తెచ్చారు. అందులో వేరుశనగ దిగుబడులు 4,626 క్వింటాళ్లు ఉండటం విశేషం. వేరుశనగ క్వింటాల్ గరిష్ట ధర రూ.7,560, కందులు రూ.7,450, ఆముదాలు రూ.6,290, మొక్కజొన్న రూ.2,042, శనగలు రూ.4,500లకు అమ్ముడుపోయినట్లు యార్డు కార్యదర్శి ఉమాపతి రెడ్డి తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



బాధితురాలు లక్ష్మీకి నగదు అందజేస్తున్న దృశ్యం

తుగ్గలి: జొన్నగిరికి చెందిన శ్రీనివాసులు గత నెల13వ తేదీన గుండెపోటుతో మృతి చెందారు. గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యురిటీ గార్డుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న శ్రీనివాసులు మృతి స్నేహితులను బాధించింది. స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకోవాలని 2003 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ మిత్రులంతా కలిసి రూ.50 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని ఆదివారం సాయంత్రం శ్రీనివాసులు భార్య లక్ష్మికి అందజేసి స్నేహభావం చాటుకున్నారు.

రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహంపై హర్షం



జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి

చిప్పగిరి: విశాఖలో రెండు రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రాతిష్టాత్మకంగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ భారీ స్థాయిలో విజయవంతం కావడం, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఒప్పందాలు చేసుకోవడంపై చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి హర్షం వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషితో ప్రముఖ దిగ్గజ పారిశ్రామిక సంస్థల అధిపతులు సదస్సులో పాల్గొనడం జరిగిందన్నారు. రాష్ట్రానికి సుమారు రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు జరిగాయని, వివిధ పరిశ్రమల ఏర్పాటుతో 6 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమన్నారు.

సింహ వాహనంపై శ్రీరంగనాథుడు



సింహవాహనంపై ఊరేగుతున్న శ్రీరంగనాథుడు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథుడి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం దేవాలయంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం రాత్రి స్వామి వారు సతీసమేతంగా సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అతకుముందు స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సృష్టికి తానే సర్వం సహ చక్రవర్తి అని తెలిపేందుకు స్వామి వారిని సింహ వాహనంపై ఊరేగిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించినట్లు అర్చకులు రంగస్వామి తెలిపారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

13న టెంకాయల వేలం

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా నిర్వహించే వీరభద్ర స్వామి ఉత్సవాల సందర్భంగా టెంకాయలను విక్రయించుకునే హక్కుల కోసం ఈ నెల 13వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

ఆలయంలో దొంగలు

ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు పట్టణంలోని కోసిగి రోడ్డులో ఉన్న సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి దొంగలు పడ్డారు. రాత్రి 10.45 సమయంలో ఇద్దరు దుండగులు ఆలయం తాళాలు ఇనుప రాడ్‌తో పగలగొట్టి లోపలికి దూరారు. స్వామివారి హుండీ తెరిచేందుకు విఫలయత్నం చేశారు. ఆలయంలో కలియ దిరిగి విలువైన వస్తువుల కోసం వెతికారని, వారికి ఎలాంటి వస్తువులు దొరక్క వెనుదిరిగి పోయారని ధర్మకర్త కుటుంబ సభ్యులు గుమ్మల సీతారామయ్య తెలిపారు. ఈ దృశ్యాలన్నీ ఆలయంలోని సీసీ కెమెరాలో నమోదయ్యాయి.

శనగ రైతుకు మద్దతు

- ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.5,335
- అన్ని ఆర్బీకేల్లో ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లు
- ఆలూరు సబ్ డివిజన్‌లో రబీలో 2.20 లక్షల క్వింటాళ్ల శనగ దిగుబడులు
- మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లపై రైతుల హర్షం



ఆర్బీకే వద్ద ధాన్యం కొనుగోలు చేస్తున్న మార్క్‌ఫెడ్, కేడీసీఎంఎస్ అధికారులు

ఆలూరు రూరల్: రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో రైతుల కష్టాలు తెలుసుకున్న ఆయన వారికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. పంట సాగుకు పెట్టుబడి సాయం దగ్గర నుంచి రాయితీ విత్తనాలు, ఆర్బీకేల ద్వారా ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నారు. భరోసా నగదు నేరుగా రైతుల ఖాతాల్లో జమచేస్తున్నారు. చేతికొచ్చిన పంట దళారులకు అమ్మి మోసపోరాదనే ఉద్దేశంతో ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తోంది. శనగ దిగుబడులను ఆర్బీకేల వద్ద మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా కొనుగోలు చేస్తున్నారు. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులు వారి గ్రామ ఆర్బీకేలో దిగుబడులు అమ్మేందుకు రిజిస్ట్రేషన్ చేసుకుంటే.. ఆ రైతు మొబైల్‌కు మెసేజ్ వస్తుంది. మెసేజ్ ఆధారంగా రైతు పంట అమ్ముకోవచ్చు.

దిగుబడులకు మద్దతు ధర

చిన్న సన్నకారు రైతులు పంట దిగుబడులను అమ్ముకునేందుకు ఇబ్బందులు పడరాదని, దళారులను నమ్మి మోసపోకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పంట దిగుబడులకు మద్దతు ధర కల్పించింది. క్వింటా పప్పుశనగ ధర రూ.5,335గా నిర్ణయించింది. మార్క్‌ఫెడ్ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య లిమిటెడ్)సంస్థ డీసీఎంఎస్ (డిస్ట్రిక్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ)ద్వారా ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లోనే దిగుబడులు అమ్ముకునే వెసలుబాటు కల్పించింది. తూకాల్లో మోసాలు లేకుండా కొన్న పంటను తరలించేందుకు లారీ బాడుగ ఖర్చు భారం కాకుండా ప్రభుత్వమే సరుకును రవాణా చేసుకుంటుంది. అమ్మిన పంట నగదును నేరుగా వారం రోజుల్లో రైతు ఖాతాల్లో జమ చేస్తున్నారు. గోనె సంచులను ప్రభుత్వం నుంచి ఉచితంగా సరఫరా చేస్తున్నారు. ముందుగా ఆర్బీకేలలో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు నిర్ణయించిన తేదీల్లో వంద క్వింటాళ్ల వరకు కొనుగోలు చేస్తారు.

ఈ-క్రాప్ నమోదైన రైతులకు అవకాశం

రబీ సీజన్‌లో పంటలు సాగు చేసి ఈ-క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతులకు మాత్రమే ధాన్యం అమ్ముకునే అవకాశం ఉంది. సొంత పొలం ఉన్న రైతులతో పాటు కౌలు రైతులు కూడా పంట దిగుబడులను ప్రభుత్వ మద్దతు ధరతో విక్రయించుకోవచ్చు. ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్ 5 మండలాల్లో ఈ ఏడాది రబీ సీజన్‌లో 46 వేల ఎకరాల్లో రైతులు శనగ పంట సాగు చేయగా ఇప్పటివరకు 2.20 లక్షల క్వింటాళ్ల పంట దిగుబడి వచ్చిందని వ్యవసాయ అధికారులు వెల్లడించారు. ఇది కేవలం ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులు మాత్రమే అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న గిట్టుబాటు ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ధర బాగుంది



ఏటా పంట దిగుబడులు అమ్ముకోవడానికి ఇబ్బంది పడేవాళ్లం. ప్రస్తుతం మా గ్రామానికే వచ్చి దిగుబడులు కొనుగోలు చేస్తున్నారు. శనగ పంటకు ప్రభుత్వం రూ.5,335 ధర కల్పించడం సంతోషంగా ఉంది. బయట ధర 4,600 మాత్రమే ఉంది. ప్రభుత్వం నిర్ణయించిన ధర బాగుండడంతో పాటు హమాలీ, గోనెసంచులు, రవాణా ఖర్చులు తప్పాయి.

– శ్రీనివాసులు, రైతు, పెద్దహోతూరు

సద్వినియోగం చేసుకోండి



రాష్ట్ర ప్రభుత్వం రూ.5,335 మద్దతు ధరతో ఏర్పాటు చేసిన శనగ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ-క్రాప్ చేసుకున్న రైతుల వివరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో చూపిస్తాయి. పంట ఎన్ని ఎకరాల్లో సాగు చేశారు.ఏ పంట దిగుబడి చేశారు అనే వివరాల ఆధారంగా పంట దిగుబడులను కొనుగోలు చేస్తారు.గోనే సంచులు ప్రభుత్వమే ఉచితంగా అందించి రవాణా ఖర్చు భరిస్తోంది. తూకాల్లో మోసాలు ఉండవు.

– సునీత, ఏడీఏ,

లారీ బోల్తా

తుగ్గలి: మండల పరిధిలోని గిరిగెట్ల గరిడి వంక వద్ద శనివారం రాత్రి లారీ బోల్తా పడడంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పత్తికొండ నుంచి గుత్తి వైపు ఎరువు లోడుతో వెళుతున్న లారీ మార్గమధ్యలో గిరిగెట్ల వంక వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించినట్లు సమాచారం.

నేడు విద్యుత్ కోతలు

తుగ్గలి: రామలింగాయపల్లి, పెండేకల్లు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్వరరెడ్డి తెలిపారు. మరమ్మతుల కారణంగా రెండు గంటల పాటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన చెప్పారు.

నునసరాళ్ల సబ్ స్టేషన్ పరిధిలో..

కృష్ణగిరి: మండల పరిధిలోని లక్కసాగరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాముడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తుగ్గలి మండలం నునసరాళ్ల సబ్ స్టేషన్‌లో పనులు జరుగుతున్నందున లాల్‌మాన్‌పల్లె, బోయబొంతిరాళ్ల, లక్కసాగరం, పందిర్లపల్లె, తెగదొడ్డి గ్రామాలకు రెండు గంటలు సరఫరా ఉండదని వెల్లడించారు.

ఆర్థిక సాయం అందజేత

వెల్దుర్తి: రామళ్లకోటకు చెందిన నిరుపేద దుగ్గి శాంతయ్య కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు హరిసింహనాయుడు ప్రతినెలా మాదిరి పింఛన్ రూపంలో ఆదివారం కొంత ఆర్థిక సహాయం అందించాడు. స్థానిక గ్రంథాలయాధికారిణి కవితాబాయ్, మరో అజ్ఞాత దాత తనవంతుగా ఆ కుటుంబానికి సాయమందించారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి



ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక సంస్థల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసుదన్ ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమవంతుగా పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పట్టణ జేసీఎస్ కన్వీనర్లు బంగిశ్రీరాం, షబ్బీర్‌అహమ్మద్, వార్డు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ (సాంఘిక సంక్షేమ) గురుకుల బాలికల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022–23లో నాల్గవ తరగతి చదువుతున్న వారు ఐదవ తరగతికి, ఇదే ఏడాదిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఇంటర్ ప్రవేశాలకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇంటర్‌కు దరఖాస్తు చేసుకునేందుకు 17 ఏళ్లలోపు వయసుగల వారు అర్హులని తెలియజేశారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులకు, ఐదవ తరగతికి సంబంధించి ఈ నెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బాలికలు స్వయంశక్తితో ఎదగాలి

ఆలూరు: నిరంతరం తరగనిది విద్య మాత్రమేనని కమ్మరచేడు గ్రామ సాయి బాబా మందిరం నిర్వాహకులు, ఆనంద నిలయం సేవాసమితి ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీకంఠమూర్తి అన్నారు. గ్రామంలో బాలికలకు ఉచితంగా మూడు నెలల పాటు కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆలయంలో ఆదివారం శిక్షణ బ్యాచ్ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. బాలికలు స్వయం శక్తితో ఎదగాలన్నారు. నేడు ఫ్యాషన్ డిజైనింగ్ వల్ల ఎంతోమంది ఉపాధి అవకాశాలు పొందుతున్నారని వివరించారు. ఆలయకమిటీ పెద్దలు మల్లికార్జున రెడ్డి, కృష్ణారెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కుట్టు శిక్షణ మాస్టారుకు బాలికలు జ్ఞాపికను అందజేసి ప్రత్యేకంగా సన్మానించారు.


వైద్య శిబిరానికి స్పందన

హొళగుంద: స్థానిక తేరుబజారులో జమాతి ఆలేహదీస్, గ్రామస్తుల ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రం సిరుగుప్పకు చెందిన న్యూలైఫ్ చిన్న పిల్లల హాస్పిటల్ వారు ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరంలో హాస్పిటల్‌కు చెందిన చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టర్ ఇర్ఫాన్, మహిళా వైద్యురాలు అమినా దాదాపు 300 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని, వారు తినే ఆహారం, నడవడికను గమనిస్తుండాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, మహిళలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలన్నారు. మౌలిసాబ్‌లు సమియుల్లా, హాజీ అబ్దుల్లా, అజీమ్‌సాబ్, ఈశా తదితరులు వైద్య శిబిరం నిర్వహణకు సహకరించారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు

ఆలూరు: దేవనకొండలో మూగి తాత ఉరుసు సందర్భంగా ఆదివారం దర్గా ముజవర్లు ప్రత్యేక ఫతేహాల్ సమర్పించారు. గ్రామంలోని వారే గాకుండా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు దర్గాను సందర్శించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. దేవనకొండ ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ సభ్యులు రామకృష్ణ, విరుపాక్షి, పలువురు అధికారులు దర్గాను సందర్శించారు. ఉరుసు సందర్భంగా పత్తికొండ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ భూపాలుడు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

విస్తృతంగా ప్రచారం



ప్రచార కరపత్రాలను విడుదల చేస్తున్న గుమ్మనూరు శ్రీనివాసులు

ఆలూరు: వైఎస్సార్‌సీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆ పార్టీ నాయకులు గుమ్మనూరు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం మండల కన్వీనర్ వీరేష్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యులు, పట్టభద్రులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ తరఫున ఉపాధ్యాయ, పట్టభద్రులు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థులు రామచంద్రారెడ్డి, వెన్నపూస రవీంద్రారెడ్డి, డాక్టర్ మధుసూదన్‌ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. నాయకులు రాజారెడ్డి, ఈరన్న, రంగమ్మ, నాగవేణి, శ్రీరాములు, దేవిరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా స్థానిక నాయకులు ఓటర్లకు కరపత్రాలు అందజేస్తూ ప్రచారం చేశారు. నాయకులు మూలింటి రాఘవేంద్ర, సుంకర రామాంజినేయులు తదితరులు ఉన్నారు.

నందవరం: మండలంలోని గంగవరం, జొహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి గ్రామాల్లో ఆదివారం సర్పంచ్ బైటిగేరి శివన్న, ఎంపీటీసీ విజయమోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టభద్రులను కలిసి వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటు వేయాలని అభ్యర్థించారు.

గోనెగండ్ల: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దొరబాబు, నాయకులు బందెనవాజ్, మనోహర్ రెడ్డి తదితరులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలిసి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని విన్నవించారు.

కృష్ణగిరి: మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తెలుగు వెంకటేష్, కురువ సుంకన్న, చిన్న మద్దయ్య ఆధ్వర్యంలో ఆగవేళి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులకు కరపత్రాలు అందజేస్తూ ఓటు అభ్యర్థించారు.

మద్దికెర: స్థానిక రాంనగర్, సాయినగర్ కాలనీలలో ఆదివారం జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఐడీసీ డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు పట్టభద్రులను కలిసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేశారు.

హాస్యం పంచిన కామన్న వేడుకలు



వివిధ వేషాల్లో హాస్య నాటకాలు ప్రదర్శిస్తున్న యువకులు

హొళగుంద: మండల కేంద్రంలోని విరక్త మఠం పరిసర ప్రాంతానికి చెందిన యువకులు నిర్వహిస్తున్న కామన్న వేడుకల్లో భాగంగా ఆదివారం ప్రదర్శించిన హాస్య సన్నివేశాలు జనాలను కడుపుబ్బ నవ్వించాయి. గత మూడు రోజులుగా జరిగిన కార్యక్రమాలు ప్రజలను అమితంగా ఆకట్టుకున్నాయి. వేడుకలు కొద్ది రోజుల్లో ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

గోనెగండ్ల: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పట్టభద్రుల అభ్యర్థులకు ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ వేణుగోపాల్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్లిప్పులను ఆయా గ్రామాల్లో వీఆర్వోలు ఆదివారం నుంచి పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఓటర్లకు స్లిప్పులు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మండలంలో ఎమ్మెల్సీ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

గోనెగండ్ల: గత కొద్ది రోజులుగా జిల్లాలో అక్కడక్కడ దొంగతనాలు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ తిమ్మారెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ దొంగలు తలుపులు వేసిన ఇళ్లను టార్గెట్ చేసి దొంగతనాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఏదైనా పని నిమిత్తం బయటకు లేదా పొలాలకు వెళ్లేవారు, పండుగలకు, జాతరలకు వేరే గ్రామాలకు వెళ్లేవారు ఇళ్లకు తాళం వేయడంతో పాటు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

త్రైత సిద్ధాంతంతో ఆధ్యాత్మిక జ్ఞానం

వెల్దుర్తి: త్రైత సిద్ధాంత భగవద్గీతను చదివి ఆచరించడం ద్వారా సత్యమైన ఆధ్యాత్మిక జ్ఞానం పొందగలదని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక ధర్మవరం కమిటీ అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ఆదివారం కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోనా సర్పరాజాపురంలో త్రైత సిద్ధాంత ప్రచారం నిర్వహించారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యేగీశ్వరులు రాసిన వంద రకాల గ్రంథాలను పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు మద్దిలేటి, వెంకటేశ్, శ్రీనివాసులు, రాజశేఖర్, మనోహర్, అనిల్, మురళి, శివలక్ష్మి, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకాచార్య జయంతి

హొళగుంద: వీరశైవ సమాజాభివృద్ధికి తనవంతు సేవలందించిన ఆది జగద్గురు రేణుకాచార్య జయంతి వేడుకలను ఆదివారం హొళగుందలో వీరశైవ లింగాయుతులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఉరవకొండ స్వామి (విరక్త మఠం) మఠంలో ఆది జగద్గురు రేణుకాచార్య చిత్రపటానికి లింగాయుతులు మంగళహారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుల పెద్దలు మాట్లాడుతూ వీరశైవ లింగాయుతులకు జగద్గురు రేణుకాచార్య, విశ్వగురు బసవేశ్వరుడు రెండు కళ్లులాంటి వారని వారన్నారు. వీరశైవ సమాజానికి వారు అందించిన తత్వాలు, తెచ్చిన కీర్తి, అందించిన సేవలు మరవలేమన్నారు. ఉభయుల అడుగు జాడలో లింగాయుతులు నడుస్తూ వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు

హొళగుంద: దేవరగట్టులో వెలసిన మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని విరాట్‌మూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. పూజారులు ఆలయంలో మూల విరాట్‌లకు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, భండరార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళారతి, అర్చనలతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాళ మల్లేశ్వరుడిని దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. కొందరు మోకాళ్లపై మెట్లు ఎక్కుతూ వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

పత్తికొండ రూరల్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్ అన్నారు. ఆదివారం కేజీఎన్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముందుగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజేష్‌గౌడు పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశానికి వైఎస్ఆర్‌సీపీ జిల్లా నాయకుడు మురళీధర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర నాయకుడు రామచంద్రయ్య, టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు హాజరయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డి విజయానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపునకు పట్టణంలోని మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని ఆయన నివాసంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు, నాయకులతో సమావేశం నిర్వహించి రవీంద్రారెడ్డి గెలుపునకు చేపట్టాల్సిన ప్రచారం, ఇతర అంశాలపై సూచనలిచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత యువతకు సచివాలయ ఉద్యోగాలను కల్పించారన్నారు. అలాగే పోలీసు శాఖలో ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి ఎంపిక కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిందన్నారన్నారు. త్వరలో పలు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ నియామకాల కోసం నోటిఫికేషన్లు వెలువడనున్నాయని తెలిపారు. నాయకులు వారి వార్డు పరిధిలో ఉండే పట్టభద్రులను కలిసి ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగాల కల్పన తదితర అంశాలపై వివరించి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, పార్టీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


15న కౌలు రైతుల జిల్లా సదస్సు



మాట్లాడుతున్న సంఘం జిల్లా కార్యదర్శి

ఎమ్మిగనూరుటౌన్: కౌలు రైతుల జిల్లా సదస్సు ఈనెల 15వ తేదీన ఆస్పరిలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 50 వేల మంది కౌలు రైతులు ఉన్నారని, గత్యంతరం లేని స్థితిలో పంటలు సాగుచేస్తున్నారన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరల్లేకపోవడంతో కౌలు రైతులు ఏటా తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కౌలు రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, రైతు భరోసా తదితర పథకాలు వర్తింప జేయాలన్నారు. కౌలు రైతుల సదస్సుకు రాష్ట్ర రైతు సంఘ అధ్యక్షులు రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్యలు హాజరుకానున్నారని తెలిపారు. సమావేశంలో రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పంపణ్ణగౌడ్, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, సీపీఐ ప్రజాసంఘాల నాయకులు భాస్కర్‌యాదవ్, జబ్బార్, చిన్నన్న, బాలరాజు, బజారి, శాంతప్ప, తిమ్మగురుడు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శం.. సంపద కేంద్రం



పచ్చని చెట్ల మధ్య వెల్దుర్తిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం



వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువు తయారు చేస్తున్న దృశ్యం

వెల్దుర్తి: వెల్దుర్తి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఇతర కేంద్రాలకు ఆదర్శంగా నిలిచింది. నక్కల తిప్పపై ఏడేళ్ల క్రితం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్‌ను నిర్మించగా అప్పటి సర్పంచ్ ఆవులభారతి దీనిని ఆకర్షణీయంగా, ఆహ్లాదంగా తీర్చిదిద్దారు. రాష్ట్ర అవార్డు కూడా పొందారు. ఇక్కడ గ్రీన్ అంబాసిడర్లకు, కేంద్రాల నిర్వాహకులకు, సంపద తయారీపై శిక్షణ కార్యక్రమాలు సైతం జరిగాయి. నాలుగేళ్ల క్రితం షార్ట్ సర్క్యూట్‌తో సెంటర్ దగ్ధమయ్యింది. ప్రస్తుత సర్పంచ్ ముత్యాల శైలజ, నాటి ఈఓ ఉపేంద్రరెడ్డి, నేటి ఈఓ జేమ్స్ కృపవరం కలిసి జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా కేంద్రాన్ని తిరిగి మరింత అందంగా, ఆదర్శంగా తీర్చిదిద్దారు. పట్టణంలో సేకరించిన తడి చెత్త (కూరగాయల వేస్ట్ ఇతరత్రా)తో టన్నుల కొద్ది వర్మీ కంపోస్టు తయారు చేయించి రైతులకు అతి తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఇక్కడ పొడి చెత్తతోనూ సంపద సృష్టిస్తూ జిల్లా అధికారుల ప్రశంసలు పొందుతున్నారు.